ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

శుక్రవారం 2 ఆగస్టు 2024

విశాఖకు పొంచి ఉన్న ముప్పు

వాతావరణ మార్పులతో పెరుగుతున్న సముద్ర మట్టాలు


- 1992 నుంచి 2021 వరకూ 2.381 సెంటీమీటర్ల మేర పెరిగిన నీటి మట్టం
- ఏడాదికి సగటున 0.181 సె.మీ. పెరుగుదల
- 2040కల్లా తీరంలో 6.96 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం నీట మునిగే ప్రమాదం
- ప్రమాదంలో పోర్టు, తెన్నేటి పార్కు, రుషికొండ, మంగమారిపేట బీచ్‌లు

- 7లో

ఎక్కడి పనులు అక్కడే!

అసంపూర్తిగా దర్శనమిస్తున్న ప్రభుత్వ భవనాలు

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో నిలిచిన నిర్మాణాలు
- బకాయిలు చెల్లిస్తే గాని పనుల్లో కదలిక రాని పరిస్థితి



సబ్బవరం మండలం పెదముషిడివాడలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవన నిర్మాణం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వల్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. బకాయిలు చెల్లిస్తే గానీ కాంట్రాక్టర్లు పనులు చేపట్టే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నిర్మాణాల పూర్తికి కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

గత వైసీపీ ప్రభుత్వం పరిపాలన వికేంద్రీకరణ పేరుతో జిల్లాలో 522 గ్రామ సచివాలయాలకు గాను 462 సచివాలయాలకు భవనాలు మంజూరు చేసింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.43 లక్షలు కేటాయించింది. అలాగే 377 వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణ పనులకు ప్రతి యూనిట్‌కు రూ.20.80 లక్షలు, 438 రైతు భరోసా కేంద్రాలకు ప్రతి భవన నిర్మాణానికి రూ.25.80 లక్షలు కేటాయించింది. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో చెల్లించలేదు. ఇంజనీర్లు ఖజానా శాఖ సీఎంఎఫ్ఎస్ వెబ్‌సైట్‌లో బిల్లులు అప్‌లోడ్ చేసినా ఫలితం లేకపోయింది. జిల్లాలో గత ప్రభుత్వం 462 సచివాలయాల నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ కేవలం 335 మాత్రమే పూర్తి చేయగలిగింది. 438 రైతు భరోసా కేంద్ర భవనాలకు 213, అలాగే వెల్‌నెస్ సెంటర్ భవనాలు 377కు గాను 145 మాత్రమే పూర్తి చేయగలిగింది. మిగిలి నవి వివిధ దశల్లో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి.



కె.కోటపాడు మండలం కోరువాడ గ్రామంలో నిలిచిపోయిన రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణ పనులు

బిల్లులు చెల్లిస్తేనే కదలిక

గ్రామాల్లో ప్రభుత్వ నిర్మాణ పనులను సాధారణంగా చిన్న కాంట్రాక్టర్లు చేస్తుంటారు. చాలా గ్రామాల్లో వైసీపీ నేతలే కాంట్రాక్టర్లుగా అవతారమెత్తారు. అయితే బిల్లులు రాకపోవడంతో వీరంతా గగ్గోలు పెడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్ల గణాంకాల ప్రకారం భవన నిర్మాణాలకు ప్రభుత్వం రూ.329 కోట్లు ఖర్చు చేసింది. మరో రూ.10 కోట్లకు పైగా బిల్లులు కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. పనులు పూర్తి చేయాలంటే బకాయి బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు చెబు తున్నారు. దీనిపై పీఆర్ జిల్లా ఇంజనీరింగ్ అధికారి వీరన్నాయుడు వివరణ కోరగా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిలిచిన భవన నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

ఇన్‌చార్జి పాలనలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం

గత ఏడాది జూన్‌లో నర్సీపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బదిలీ

- అనకాపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కి ఇన్‌చార్జి బాధ్యతలు
- పూర్తి స్థాయిలో అందని సేవలు



నర్సీపట్నంలోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం

నర్సీపట్నం, ఆగస్టు 1: స్థానిక ఔషధ తనిఖీ అధికారి కార్యాలయం ఏడాది కాలంగా ఇన్‌చార్జి పాలనలో నడుస్తోంది. నర్సీపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన యుగంధర్ గత ఏడాది జూన్ 23న శ్రీకాకుళం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనకాపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కీలకమైన నర్సీపట్నంలో శాశ్వత ఔషధ తనిఖీ అధికారి లేకపోవడంతో ఎంతో కీలకమైన సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదు.

స్థానిక ఔషధ తనిఖీ అధికారి కార్యాలయం పరిధిలో నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం, పాయకరావుపేట, నక్కపల్లి, పరవాడ, రావికమతం, రోలుగుంట, ఎలమంచలి, కశింకోట, ఎస్.రాయవరం మండలాల్లో 400 పైగా మెడికల్ షాపులు ఉన్నాయి. కొత్త షాపులకు లైసెన్స్‌లు మంజూరు, ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే అధికంగా అమ్మకుండా చూడడం, నకిలీ, కాలం చెల్లిన మందులు విక్రయాలు జరగకుండా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ చేస్తారు.

24 ఫార్మా కంపెనీల్లో తనిఖీ బాధ్యత

నర్సీపట్నం కార్యాలయం పరిధిలో నక్కపల్లిలో నాలుగు, పరవాడలో 20 ఫార్మా కంపెనీలు ఉన్నాయి. ఆయా కంపెనీల్లో ఇన్‌స్పెక్షన్ చేసి మంచి ఉత్పాదక అభ్యాసం (జీఎంపీ) ధ్రువపత్రం అందజేయాల్సి ఉంటుంది. డబ్ల్యూహెచ్‌వో నాణ్యతా ప్రమాణాల ప్రకారం ఫార్మా కంపెనీలలో ఉత్పత్తులు స్థిరంగా ఉత్పత్తి అవుతున్నాయని నిర్ధారించేందుకు కేంద్ర బృందంతో కలిసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ (జీఎంపీ) తనిఖీ చేసి సర్టిఫికెట్ ఇస్తారు. కీలకమైన ఔషధ తనిఖీ అధికారి కార్యాలయంలో ఇన్‌చార్జి పాలన కొనసాగుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనకాపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినప్పటికీ పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదని తెలిసింది.

వైసీపీలో ఎమ్మెల్సీ టికెట్ రేస్

పెరుగుతున్న ఆశావహులు

- ఈనెల 30న స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక
- ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల



- తనకే అవకాశం దక్కుతుందని విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ధీమా
- తాజాగా తెరపైకి మాజీ మంత్రులు అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు పేర్లు
- తన పేరు పరిశీలించాలని కోరుతున్న మాజీ ఎంపీ ఎంవీవీ
- మరోవైపు తనకు ఇవ్వాలంటూ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ పట్టు



బూడి ముత్యాలనాయుడు | గుడివాడ అమర్‌నాథ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్సీ టికెట్‌కు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాస్ పదవికి, పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోవడంతో ఖాళీ అయిన స్థానానికి ఈనెల 30న ఎన్నిక నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో వైసీపీలో పలువురు నేతలు సీటు కోసం ప్రయత్నాలు మొదలెట్టారు.

మూడున్నరేళ్ల క్రితం (2021 ఫిబ్రవరి) జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నాడు అధికారంలో ఉన్న వైసీపీ అత్యధిక స్థానాలను గెలుచుకుంది. దీంతో రెండున్నరేళ్ల కిందట జరిగిన స్థానిక సంస్థల కోటాలోని రెండు ఎమ్మెల్సీ పదవులు వైసీపీ దక్కించుకుంది. అందులో ఒక స్థానానికి నగరానికి చెందిన వంశీకృష్ణ శ్రీనివాస్‌ను, రెండో స్థానానికి వరుదు కళ్యాణిని ఎంపిక చేసింది. వంశీకృష్ణశ్రీనివాస్ గత ఏడాది వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోవడంతో ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయ్యింది. ఆ స్థానానికి ఈనెల 30న ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయడంతో వైసీపీలో పలువురు పోటీ పడుతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని స్థానిక సంస్థల్లో వైసీపీకి మెజారిటీ ఉండడంతో ఆశావహులు పెరుగుతున్నారు. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న కోలా గురువులు ఎమ్మెల్యేగా పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా పంపించాలని ఆ పార్టీ అధిష్ఠానం భావించినా క్రాస్ ఓటింగ్ కారణంగా ఓటమి పాలయ్యారు. తర్వాత ఆయన్ను పార్టీ జిల్లా అధ్యక్షునిగా నియమించడంతోపాటు డీసీసీబీ చైర్మన్ పదవి కూడా ఇచ్చారు. వంశీకృష్ణశ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ పదవిని పార్టీకి విధేయుడిగా ఉన్న గురువులుకు కేటాయిస్తారని పార్టీలో ప్రచారం జరిగింది. ఆయన కూడా ఆశలు పెట్టుకున్నారు. కానీ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం తర్వాత పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. వచ్చే ఐదేళ్లపాటు పార్టీ తరఫున పోరాటం చేయాలంటే తమకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తోపాటు బూడి ముత్యాలనాయుడు గట్టిగా అధిష్ఠానంపై ఒత్తిడి చేస్తున్నారు. మరోవైపు గడిచిన ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గం నుంచి పోటీకి దాదాపు రూ.వంద కోట్లు వరకూ ఖర్చు పెట్టిన తనను కూటమి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు ప్రారంభించిందని మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పార్టీ నేతల వద్ద వాపోయినట్టు తెలిసింది. వీటన్నింటినీ తట్టుకుని నిలబడాలంటే తనకు చట్టబద్ధమైన పదవి ఏదో ఒకటి ఉంటేనే తప్ప సాధ్యం కాదని అధిష్ఠానానికి విన్నవించినట్టు సమాచారం. ఐదేళ్లపాటు నిలదొక్కుకోవడానికి మాత్రమే ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని కోరినట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ కూడా ఎమ్మెల్సీగా ... మిగతా 8వ పేజీలో

జిల్లాలో 97.26 శాతం పింఛన్లు పంపిణీ

కలెక్టర్ పర్యవేక్షణలో వేగవంతం

మిగిలిన వారికి నేడు అందజేత

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జిల్లాలో తొలిరోజైన గురువారం 97.26 శాతం పూర్తి చేశారు. కలెక్టర్ విజయకృష్ణన్, డీఆర్‌డీఏ అధికారుల పర్యవేక్షణలో సచివాలయాల సిబ్బంది పింఛన్ల పంపిణీని ఉదయం 6 గంటల నుంచే ప్రారంభించారు. కలెక్టర్ విజయకృష్ణన్ అనకాపల్లి మండలం గోపాలపురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పలువురికి పింఛన్లు అందజేశారు. జిల్లాలో 2,62,624 మంది లబ్ధిదారులు ఉండగా, రూ.108.41 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి డీఆర్‌డీఏ అధికారుల నివేదికల ప్రకారం జిల్లాలో 2,55,421 మందికి (97.26 శాతం) రూ.105.39 కోట్లు అందజేశారు. ఇంకా కేవలం 7,203 మందికి మాత్రమే పింఛన్ల పంపిణీ జరగాల్సి ఉంది. వాస్తవానికి 1, 2 తేదీల్లో పింఛన్ల పంపిణీ నూరు శాతం పూర్తి చేయాలని, తొలి రోజు 90 శాతం పంపిణీ లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించిన గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది గురువారం సాయంత్రానికి 97.26 శాతం పంపిణీ పూర్తి చేశారు. కొందరు లబ్ధిదారులు ఇళ్లల్లో లేకపోవడం, ఇతరత్రా కారణాలతో అందుబాటులో లేకపోవడం వల్ల 7,203 మందికి పింఛన్లు ఇవ్వలేకపోయారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం సాయంత్రంలోగా మిగిలిన వారందరికీ పింఛన్లు అందజేసి నూరు శాతం లక్ష్యాన్ని సాధిస్తామని అధికారులు తెలిపారు.



అనకాపల్లి మండలం గోపాలపురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్, తదితరులు

పాఠశాలలకు యాజమాన్య కమిటీలు

ప్రస్తుతం ఉన్న తల్లిదండ్రుల కమిటీలు రద్దు

- జిల్లాలో 1,424 పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు
- 8న ఎన్నికల కోసం నోటిఫికేషన్ జారీ చేసిన అధికారులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)



పాయకరావుపేట మండలం గుంటపల్లి ఎంపీపీ స్కూల్లో ఎస్ఎంపీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రదర్శనగా ఉంచిన దృశ్యం

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో గాడి తప్పిన విద్యారంగాన్ని చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే గత ప్రభుత్వం అమలు చేసిన అనేక పథకాల్లో సమూల మార్పులు తెచ్చిన ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. గత వైసీపీ ప్రభుత్వం నియమించిన పాఠశాలల్లోని తల్లిదండ్రుల కమిటీలను మార్చాలని నిర్ణయించింది. తల్లిదండ్రుల కమిటీల పదవీకాలం పూర్తి కావడంతో వాటి స్థానాల్లో కొత్తగా పాఠశాల యాజమాన్య (స్కూల్ మేనేజ్‌మెంట్) కమిటీలను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి స్పష్టమైన మార్గదర్శకాలు అందాయి. జిల్లాలో 1,424 పాఠశాలలు ఉండగా, ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 2,13,190 మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుతున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ లక్ష్మమ్మ నేతృత్వంలో ఆయా పాఠశాలల్లో గతంలో వున్న తల్లిదండ్రుల కమిటీలను రద్దు చేస్తూ కొత్తగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికల కోసం గురువారం షెడ్యూల్ ప్రకటించారు.

8న ఎన్నికలు

జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీల నియామకాల కోసం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 8న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖాధికారులు పాఠశాలల నోటీసు బోర్డులపై ఎన్నికల షెడ్యూల్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికలు జరిగిన రోజునే కమిటీల ప్రమాణస్వీకారం, తొలి సమావేశాలు నిర్వహించనున్నారు.

పోటీకి నిబంధనలు ఇవీ..

పాఠశాల యాజమాన్య కమిటీల చైర్మన్లు, సభ్యులుగా పోటీ చేసేవారు స్థానికులై ఉండాలి. వారి పిల్లలు తప్పనిసరిగా ... మిగతా 8వ పేజీలో

గిరిజనుడిపై గంజాయి బ్యాచ్ దాడి




గాయపడిన త్యాడ ఎర్రయ్య

దేవరాపల్లి, ఆగస్టు 1: తన గ్రామానికి వెళ్లేందుకు దేవరాపల్లిలో ఆటో కోసం ఎదురుచూస్తున్న ఓ గిరిజనుడిపై గంజాయి సేవించిన నలుగురు వ్యక్తులు గురువారం దాడి చేసి గాయపరిచారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అల్లూరి జిల్లా పినకోట శివారు వీరభద్రపురం గ్రామానికి చెందిన త్యాడ ఎర్రయ్య అనే గిరిజనుడు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న తన కుమార్తె వద్దకు వెళ్లి తిరిగి వస్తూ తన గ్రామానికి వెళ్లడానికి ఆటో కోసం గురువారం సాయంత్రం దేవరాపల్లిలో ఎదురు చూస్తున్నాడు. ఆ సమయంలో గంజాయి సేవించిన నలుగురు వ్యక్తులు వచ్చి ఎర్రయ్యను రూ.500 ఇవ్వమని అడిగారు. లేవని చెప్పడంతో టైల్ పెంకుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు ఎర్రయ్యను దేవరాపల్లి పీహెచ్‌సీకి తరలించి దాడి చేసిన వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పినకోట సర్పంచ్ గణేశ్, గ్రామస్థులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

సాగునీటి వనరులు కలుషితం

- ఫార్మా వ్యర్థాలతో పాడైన పెద్ద చెరువు నీరు
- పంట పొలాలకు మళ్లించేందుకు రైతులు వెనుకంజ
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఫార్మా యాజమాన్యాలు



ఫార్మా వ్యర్థాలు కారణంగా కలుషితమైన పరవాడ పెద్ద చెరువు

పరవాడ, ఆగస్టు 1:

మండలంలోని విశాఖ ఫార్మాసిటీ (రాంకీ)లోని పరిశ్రమలు వ్యర్థ జలాలను బయటకు విడిచిపెడుతుండడంతో చుట్టు పక్కల గ్రామాల్లో భూగర్భ జలాలు, సాగునీటి వనరులు కలుషితమవుతున్నాయి. ఫార్మా కంపెనీలతో పాటు రాంకీ యాజమాన్యం శుద్ధి చేయని వ్యర్థాలను నేరుగా గెడ్డల్లోకి విడిచిపెడుతున్నాయని, అక్కడ నుంచి చెరువుల్లోకి చేరుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గతంలో ఏడాది పొడవునా నీటితో కళకళలాడిన పరవాడలోని పెద్ద చెరువు ఇప్పుడు రసాయన వ్యర్థాలతో కాలుష్య కాసారంగా మారింది. పైగా చెరువు నుంచి తీవ్ర దుర్వాసన వస్తుండడంతో రైతులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరవాడ సీతారామ కల్యాణ మండపం నుంచి పైడిమాంబ ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఈ చెరువు కింద గతంలో 400 ఎకరాల ఆయకట్టు ఉండేది. కానీ ఫార్మాసిటీ నిర్వాకం వల్ల పంట పొలాలకు నీరు పెట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఫార్మా ఉత్పత్తులు తయారీ అనంతరం వచ్చే వ్యర్థాలను శుద్ధి చేయడానికి రాంకీ యాజమాన్యం ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నది. వ్యర్థాలను శుద్ధి చేసిన అనంతరం మంచినీటిని మాత్రమే బయటకు విడుదల చేయాలి. ఇందుకోసం నిర్ణీత మొత్తాన్ని సదరు కంపెనీల నుంచి వసూళ్లు చేస్తుంది. అదే విధంగా ఫార్మా కంపెనీలు రసాయన వ్యర్థాలను నేరుగా బయటకు విడుదల చేయకూడదు. కానీ ఈ నిబంధనలను ఇటు ఫార్మా కంపెనీలు, అటు రాంకీ యాజమాన్యం బేఖాతరు చేస్తున్నాయి. ఫార్మా కంపెనీల్లో రాత్రి వేళల్లో రసాయన వ్యర్థాలను నేరుగా డ్రైనేజీల ద్వారా బయట ఉన్న గెడ్డల్లోకి వదులుతున్నారు. రాంకీ యాజమాన్యం కూడా వ్యర్థాలను శుద్ధి చేయకుండా పరవాడ పెద్ద చెరువులోకి విడిచిపెడుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో చెరువులోని నీరు నల్లగా మారిపోయి కలుషితమైంది. చెరువులోకి దిగితే దురదలతో పాటు చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు.



తానాం సమీపంలో గెడ్డవాగులోకి విడిచిపెట్టిన ఫార్మా వ్యర్థాలు (ఫైల్‌ఫొటో)

గెడ్డల్లోనూ వ్యర్థాలు దర్శనం

పెద్ద చెరువు సమీపంలో గల గెడ్డలు వ్యర్థ జలాలతో కలుషితమవుతున్నాయి. ఈ గెడ్డల ద్వారా దిగువన ఉన్న పొలాల్లోకి చేరుతుంది. స్థానిక మల్లోడిగెడ్డలోకి వ్యర్థ జలాలను విడిచిపెట్టడంతో నీరంతా కలుషితమైంది. ఆ నీటిని పొలాలకు మళ్లించేందుకు రైతులు భయపడుతున్నారు. పీసీబీ ఆదేశాల మేరకు రాంకీ యాజమాన్యం మల్లోడిగెడ్డలో వ్యర్థ జలాలను ట్యాంకర్ల ద్వారా తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇప్పటికీ గెడ్డలో ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

రెండు దేవాలయాల్లో హుండీలు చోరీ


విజయరామరాజుపేట ఆంజనేయస్వామి దేవాలయంలో చోరీకి గురైన హుండీ


విజయరామరాజుపేట స్మశానంలో పారేసిన హుండీ

బుచ్చెయ్యపేట, ఆగస్టు 1: విజయరామరాజుపేటలో రెండు దేవాలయాలకు చెందిన హుండీలు చోరీకి గురయ్యాయి. బుధవారం అర్ధరాత్రి దొంగలు స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో హుండీ తాళం పగులకొట్టి నగదు దోచుకెళ్లారు. అలాగే పోలేపల్లి అమ్మవారి ఆలయ హుండీని ఎత్తుకెళ్లిపోయారు. కాగా మరో గ్రామానికి చెందిన దేవాలయం హుండీ లోని నగదు అపహరించిన దొంగలు స్థానిక స్మశానంలో దానిని పారేశారు. దేవాలయాల్లో హుండీలు చోరీపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

60 కిలోల గంజాయి స్వాధీనం

కొయ్యూరు, ఆగస్టు 1: ఒడిశా నుంచి కాకినాడకు తరలిస్తున్న 60 కిలోల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని బాలుడిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం మండలంలోని కినపర్తి పంచాయతీ భీమవరం శివారులో తమ సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఆటోలో తరలిస్తున్న 60 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. గంజాయి తరలిస్తున్న ఒడిశాలోని నేరడపల్లికి చెందిన ఒక వ్యక్తితో పాటు చింతపల్లి మండలానికి చెందిన బాలుడిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

జూదం ఆడుతున్న 12 మంది అరెస్టు

» 9 ద్విచక్రవాహనాలు, రూ.23,092 నగదు స్వాధీనం

కొయ్యూరు, ఆగస్టు 1: మండలంలో మూలపేట పంచాయతీ కొండ సంత గ్రామ శివార్లలో చిత్తులాట (ఎగరకానులు) శిబిరంపై గురువారం కొయ్యూరు పోలీసులు దాడులు నిర్వహించి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.23,092 నగదుతో పాటు 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. మరో 11 మంది పరారీలో ఉన్నట్టు చెప్పారు.

సైబర్ మోసంపై పోలీసులకు ఫిర్యాదు

దేవరాపల్లి, ఆగస్టు 1: సైబర్ నేరగాళ్ల చేతిలో దేవరాపల్లికి చెందిన ఓ యువకుడు మోసపోయాడు. తన బ్యాంకు ఖాతా నుంచి రూ.94 వేలు పోగొట్టుకున్నాడు. దీనిపై గురువారం సాయంత్రం దేవరాపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. దేవరాపల్లి మద్యం షాపులో సేల్స్‌మన్‌గా కదిరి ప్రసాద్ పని చేస్తున్నాడు. తన పీఎఫ్ నగదు జమ కోసం తిమిరాం మద్యం షాపులో పని చేస్తున్న చిన్నా అనే వ్యక్తిని బుధవారం సంప్రతించాడు. దేశపాత్రునిపాలేనికి చెందిన విజయ్ అనే యువకుడి ఫోన్ నంబర్‌ను చిన్నా ఇచ్చాడు. దీంతో ప్రసాద్ ఆ వ్యక్తిని సంప్ర తించాడు. అతను బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్‌కార్డు తదితర వివరాలను చెప్పమన్నాడు. ఓటీపీ వస్తుందని చెప్పమన్నాడు. అతనికి ఆ వివరాలు చెప్పాడు. అంతే 20 నిమిషాల్లో రూ.94 వేలు ప్రసాద్ బ్యాంక్ ఖాతా నుంచి విత్‌డ్రా అయ్యాయి. మోసపోయానని తెలిసి ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డివైడర్‌ను ఢీకొని కార్మికుడి మృతి

రాంబిల్లి, ఆగస్టు 1: మండలంలోని లారస్ పరిశ్రమ సమీపంలో డివైడర్‌ను బైక్ ఢీకొన్న ప్రమాదంలో కార్మికుడు మృతి చెందినట్టు రాంబిల్లి సీఐ నరసింగరావు తెలిపారు. ఈ ప్రమాదంలో ఒడిశా రాష్ట్రం బిస్వజిత్ పాండా(24) మృతి చెందినట్టు ఆయన చెప్పారు. సెజ్‌లోని ప్రైవేటు పరిశ్రమలో విధులు ముగించుకుని రాత్రి సమయంలో బైక్‌పై అచ్యుతాపురం వస్తుండగా లారస్ పరిశ్రమ వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందినట్టు సీఐ నరసింగరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలోని గొలుసు చోరీ

రాంబిల్లి, ఆగస్టు 1: మండలంలోని గజిరెడ్డిపాలెం గ్రామంలో ఎరిపిల్లి నూకమ్మ బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఆమె మెడలోని 3 తులాల పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసినట్టు సీఐ నరసింగరావు తెలిపారు. బాధితురాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

వ్యాపారి హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు

ఎలమంచిలి, ఆగస్టు 1: పట్టణంలో గత నెల 27వ తేదీన జరిగిన బంగారు వ్యాపారి హత్య కేసులో గురువారం మరో ఇద్దరిని అరెస్టు చేసినట్టు సీఐ ఎస్‌కె. గఫూర్ తెలిపారు. వారిని కోర్టుకు తరలించినట్టు ఆయన చెప్పారు. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. గురువారం పరవాడకు చెందిన కె.సాయికృష్ణ, మల్కాపురంనకు చెందిన పూడి నరసింహామూర్తిలను అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్టు ఆయన తెలిపారు.

బంగారం షాపులో అగ్నిప్రమాదం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1: స్థానిక మెయిన్‌రోడ్డులోని నక్క రాజుకు చెందిన బంగారం వస్తువుల తయారీ దుకాణంలో గురువారం రాత్రి ఐదు కిలోల బరువు ఉన్న గ్యాస్ సిలిండర్ అగ్నికి ఆహుతి కావడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో రూ.లక్షా 50 వేల ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారి నరసింగరావు తెలిపారు.

బాలికపై అత్యాచారం

» బాలుడిపై పోక్సో కేసు నమోదు

కొత్తూరు, ఆగస్టు 1 : ప్రేమ పేరుతో బాలికపై అత్యాచారం చేసిన బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ తేజేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వి.మాడుగుల మండలానికి చెందిన ఒక కుటుంబం కూలి పని నిమిత్తం పూడేరు వచ్చారు. ఇదే గ్రామానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలుడు ప్రేమ పేరుతో తన కుమార్తెను మోసం చేసి అత్యాచారం చేశాడని బాలిక తల్లిదండ్రులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ఆ బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తేజేశ్వరరావు చెప్పారు. ఈ కేసును అనకాపల్లి దిశ పోలీసు స్టేషన్‌కు అప్పగించామని తెలిపారు.

డిపాజిట్‌దారుల సొమ్ము స్వాహా కేసులో పోస్టల్ శాఖ ఉద్యోగులకు జైలు శిక్ష

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డిపాజిట్‌దారులను మోసం చేసిన కేసులో ముగ్గురు పోస్టల్ శాఖ ఉద్యోగులకు ఐదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సీబీఐ కేసుల న్యాయస్థానం అదనపు ప్రత్యేక న్యాయమూర్తి సీఎస్ మూర్తి గురువారం తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించి సీబీఐ అధికారులు ప్రకటన విడుదల చేశారు. తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం సబ్ పోస్టాఫీస్‌లోని సబ్ పోస్ట్‌మాస్టర్ కొడమంచిలి రాజేంద్రప్రసాద్, పోస్టల్ అసిస్టెంట్లు ఐ.సత్యనారాయణ, పి.అప్పలస్వామి కలిసి 2009 అక్టోబరు 21 నుంచి 2012 సెప్టెంబరు 29 వరకూ రికరింగ్ డిపాజిట్లు కలిగిన 153 మంది ఖాతాదారులు మహిళా ప్రధాన్ క్షేత్రియ బచత్ యోజన (ఎంపీకేబీవై) పథకం కోసం కట్టిన రూ.30,56,429ను వారి ఖాతాలకు జమ చేయకుండా తమ సొంతానికి వాడేసుకున్నారు. నేరపూరిత ఆలోచనతో పథకం ప్రకారం పోస్టల్ శాఖతోపాటు ఖాతాదారులను మోసం చేసిన ముగ్గురిపైనా సీబీఐ కేసు నమోదుచేసింది. సీబీఐ కోర్టు కేసు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులు ముగ్గురికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటు సబ్ పోస్ట్‌మాస్టర్ కొడమంచిలి రాజేంద్రప్రసాద్‌కి రూ.ఏడు వేలు, పోస్టల్ అసిస్టెంట్‌లు ఐ.సత్యనారాయణకు రూ.8.29 లక్షలు, పి.అప్పలస్వామికి రూ.8.59 లక్షలు జరిమానా విధించింది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

విశాఖకు పొంచి ఉన్న ముప్పు

» ముంబై తరువాత అత్యధికంగా విశాఖలోనే సముద్ర మట్టం పెరుగుదల

» బెంగళూరుకు చెందిన సీఎస్‌టీఈపీ సంస్థ అధ్యయనంలో వెల్లడి


కోతకు గురైన సముద్ర తీరం

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో సముద్ర మట్టాలు శరవేగంగా పెరుగుతున్నాయా?, ఈ పరిణామం దేశంలోని తీర నగరాలకు ముప్పుగా పరిణమించనున్నదా?, ఆ జాబితాలో విశాఖ నగరం కూడా ఉందా? అంటే..అవుననే అంటోంది బెంగళూరుకు చెందిన సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ (సీఎస్‌టీఈపీ). 2040కల్లా తీర ప్రాంతంలో 1.02 శాతం (6.96 చ.కి. విస్తీర్ణం) నీట మునిగే ప్రమాదం ఉందని అంచనా వేసింది.

భూతాపం ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. తీర ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. గడచిన 30 ఏళ్లుగా సముద్ర మట్టాలు పెరుగుతున్నాయని ఇంటర్ గవర్నమెంటల్ ప్యానల్ అండ్ క్లైమేట్ చేంజ్ (ఐపీసీసీ) ఇప్పటికే హెచ్చరికలు జారీచేసింది. ఈ క్రమంలో 2040 నాటికల్లా విశాఖపట్నం తీరంలో 1.02 శాతం భూభాగం నీట మునిగే అవకాశం ఉందని బెంగళూరుకు చెందిన సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ (సీఎస్‌టీఈపీ) తాజా అధ్యయనం వెల్లడించింది. 1992 నుంచి 2021 వరకూ ఏడాదికి 0.181 సెంటీమీటర్ల వంతున మొత్తం 2.381 సెంటీమీటర్ల మేర సముద్ర మట్టం పెరగడంతో తీరప్రాంతంలోకి చొచ్చుకు వచ్చింది. ఇదేవిధంగా 2040 నాటికి సముద్రమట్టం 16.7 నుంచి 18.3 సెంటీమీటర్ల మేర పెరిగే అవకాశం ఉందని, తీరంలో సుమారు 1.02 ప్రాంతం (6.96 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం) ముంపునకు గురవుతుందని గత నెలలో విడుదల చేసిన అధ్యయనంలో సీఎస్‌టీఈపీ పేర్కొంది. 'సముద్ర మట్టాలు పెరిగి తీర ప్రాంతాలు ముప్పు' అన్న అంశంపై బెంగళూరుకు చెందిన సీఎస్‌టీఈపీ సంస్థకు చెందిన డాక్టర్ జె.అనూషియా, ఎం.సాయి వెంకటరమణ (ఏయూ ఓషనోగ్రఫీ పూర్వ విద్యార్థి), ఎంఎస్ ప్రదీప్, ఎస్.విద్యలతో కూడిన పరిశోధక బృందం దేశంలోని తీర నగరాలపై అధ్యయనం చేసింది. దేశంలో ముంబై తరువాత ఎక్కువగా హల్దియా, విశాఖపట్నం నగరాలే సముద్ర ముప్పునకు గురవుతాయని అధ్యయనంలో హెచ్చరించింది. విశాఖపట్నంలో పోర్టు నుంచి మంగమారిపేట వరకు తీర ప్రాంతంపై ఈ బృందం అధ్యయనం చేసింది. 2040కల్లా తీర ప్రాంతంలో 1.02 శాతం (6.96 చదరపు కిలోమీటర్లు) నీట మునిగే ప్రమాదం ఉందని అంచనా వేసింది. వ్యవసాయ భూమి 0.48 చ.కి.లు, పచ్చదనం 1.24 చ.కి, పరిశ్రమలు 5.94, నగరం 14.2, వృథా భూములు 2.6, నీటి వనరుల ప్రాంతం 7.96 చదరపు కిలోమీటర్ల వైశాల్యం మేర నీట మునగనున్నది. దీంతో విశాఖ పోర్టు, తెన్నేటి పార్కు, రుషికొండ, మంగమారిపేటల్లో సముద్రానికి దగ్గరగా ఉన్న ప్రాంతాలు నీట మునుగుతాయని ఈ సంస్థ అంచనా వేసింది. పోర్టు నుంచి మంగమారిపేట వరకూ తీర ప్రాంతం ఇప్పటికే చాలావరకు కోతకు గురై నీట మునిగింది. ఏటా విశాఖ తీరంలో సముద్రం ముందుకువస్తోంది. కోస్టల్ బ్యాటరీ, సబ్‌మెరైన్, వైఎంసీఏ ఎదురుగా సముద్ర తీరం కోతకు గురవుతుంది. ఆర్కే బీచ్‌లో స్కాండిల్ పాయింట్‌కు ఒకప్పుడు సముద్రం చాలా దూరంగా ఉండేదని, ఇప్పుడు రుతుపవన సీజన్‌లో నీరు తాకుతోందని నిపుణులు గుర్తుచేస్తున్నారు. మానవ అభివృద్ధి కార్యక్రమాలే కాకుండా వాతావరణ మార్పుల ప్రభావంతో పెరిగిన భూతాపం వల్ల సముద్ర మట్టాలు ఏటేటా పెరుగుతున్నాయి. ఇందుకు ఆసియా దేశాలు మినహాయింపు కాదని ఐపీసీసీ ఇప్పటికే స్పష్టంచేసింది. సముద్ర మట్టాలు పెరగడంతో ముంబై తరువాత ఎక్కువగా ప్రమాదానికి గురయ్యే నగరం విశాఖేనని తాజా అధ్యయనం వెల్లడిస్తోంది. సముద్ర మట్టాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టు పక్కనున్న మేహాద్రిగెడ్డలోకి నీరు ప్రవేశిస్తే ఆ ప్రాంతంలో చెట్లు, మడ అడవులు ముంపునకు గురవుతాయి. ఇంకా సముద్ర నీరు మేహాద్రిగెడ్డ లోపలకు ప్రవేశిస్తే భూగర్భ జలాలు ఉప్పునీటిగా మారతాయి. బీచ్‌రోడ్డు ఇప్పటికే కోతకు గురవుతూనే ఉంది. సముద్ర మట్టాలు పెరిగే క్రమంలో బీచ్‌రోడ్డు ప్రమాదంలో పడనున్నది. ఈ పరిణామం జీవ వైవిధ్యం, పర్యాటక, ఉపాధి రంగాలపై ప్రభావం చూపుతుంది. ఈ సంస్థ చేపట్టిన అధ్యయనం మేరకు 2060కల్లా విశాఖ తీరంలో 1.95 శాతం (13.29 చ.కి.మీ), 2080కల్లా 2.67 శాతం (18.18 చదరపు కిలోమీటర్లు), 2100కల్లా 4.76 శాతం (32.44 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం) భూమి నీట మునుగుతుందని అంచనా వేసింది.

విద్యుత్ శాఖ ఉద్యోగులకు జీపీఎఫ్ వర్తింపజేయాలి

» జీపీఎఫ్ సాధన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ త్రిమూర్తులు

» హోం మంత్రి వంగలపూడి అనితకు వినతి


హోం మంత్రి అనితకు వినతిపత్రం అందజేస్తున్న త్రిమూర్తులు

ఎస్.రాయవరం/నక్కపల్లి, ఆగస్టు 1: రాష్ట్ర విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఈపీఎఫ్ ఉద్యోగులకు జీపీఎఫ్ వర్తింపజేయాలని జీపీఎఫ్ సాధన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై.త్రిమూర్తులు కోరారు. గురువారం నక్కపల్లిలో హోం మంత్రి వంగలపూడి అనితకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1999 ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 2004 ఆగస్టు 31వ తేదీ వరకు ఉన్న ఈపీఎఫ్ ఉద్యోగులకు ఇచ్చిన 653, 654 జీవో నంబర్ల ప్రకారం జీపీఎఫ్ వర్తింపజేయాల్సి ఉండగా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు.

ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్యను పరిష్కరించాలని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని ఆయన వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి అనిత ఈ సమస్యను విద్యుత్ శాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు త్రిమూర్తులు తెలిపారు. అదేవిధంగా నక్కపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు, కూటమి నాయకులు, అధికారులు పలు సమస్యలపై హోం మంత్రి అనితకు వినతిపత్రాలు అందజేశారు.

జగన్‌ను కలిసిన వైసీపీ కార్పొరేటర్లు

» స్టాండింగ్ కమిటీ ఎన్నిక గురించి ప్రస్తావన

» అధికారం కోల్పోతే ఏ రాజకీయ పార్టీకైనా ఇలాంటి అనుభవం ఎదురవ్వడం సహజం

» కార్పొరేటర్ల రాజీనామాపై వైసీపీ అధినేత వ్యాఖ్యలు

» తాడేపల్లి టూర్‌కు ఎనిమిది మంది డుమ్మా

» వారు కూడా టీడీపీ, జనసేనల్లో చేరతారని ప్రచారం


మాజీ సీఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసిన వైసీపీ కార్పొరేటర్లు

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్పొరేటర్లు గురువారం తాడేపల్లిలో ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిశారు. ఈనెల ఏడో తేదీన జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక జరగనున్న తరుణంలో జగన్‌ను కార్పొరేటర్లు కలవడం చర్చనీయాంశంగా మారింది. జీవీఎంసీలో ఇండిపెండెంట్ కార్పొరేటర్‌తో కలుపుకుని వైసీపీకి 60 మంది కార్పొరేటర్లు ఉండేవారు. వారిలో 12 మంది ఇటీవల టీడీపీ, జనసేనల్లో చేరిపోయారు. మిగిలిన 48 మందిలో 40 మంది కార్పొరేటర్లు రెండు బస్సుల్లో బయలుదేరి తాడేపల్లి వెళ్లారు.

మాజీ సీఎం జగన్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసిన కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ ఎన్నిక విషయాన్ని ప్రస్తావించినట్టు తెలిసింది. ఎన్నికలో గెలుపొందాలంటే 49 మంది కార్పొరేటర్ల బలం అవసరమని, అంత బలం లేకపోయినప్పటికీ పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు పోటీకి దిగుతున్నట్టు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావులు వివరించారు. పలువురు కార్పొరేటర్లు పార్టీని వదిలి వెళ్లిపోయిన విషయం ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి జగన్ స్పందిస్తూ అధికారం కోల్పోతే ఏ రాజకీయ పార్టీకైనా ఇలాంటి అనుభవం ఎదురవ్వడం సహజమని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. కూటమి ఇచ్చిన హామీలు అమలుచేయడం సాధ్యం కాదని, ఈ ఐదేళ్లు ప్రజల్లోనే ఉండాలని కార్పొరేటర్లకు సూచించారు. ఈ సందర్భంగా జగన్‌ను కలిసిన వారిలో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజ్ ఉన్నారు. ఇదిలావుండగా జగన్‌ను కలిసేందుకు వెళ్లని ఎనిమిది మంది కార్పొరేటర్లు టీడీపీ, జనసేనల్లో చేరడం ఖాయమంటున్నారు. అదే జరిగితే జీవీఎంసీలో వైసీపీ బలం 40కి పడిపోనున్నది.

ఎస్సీ వర్గీకరణ హర్షించదగ్గ విషయం

» ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎంపీ సీఎం రమేశ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం రిజర్వేషన్ కోటాను ఉపవర్గీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు కల్పించడం గొప్ప విషయమన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం ఈ ఉపవర్గీకరణ ద్వారా సాకారం అవుతుందని తెలిపారు. చంద్రబాబు గతంలో సీఎంగా ఉన్నప్పుడు ఎస్సీ వర్గీకరణ జరిగిందని గుర్తుచేశారు. వర్గీకరణ తీర్పుతో లక్షలాదిమంది మాదిగ కులస్థులకు, 59 ఉపకులాలకు న్యాయం జరుగుతుందని సీఎం రమేశ్ పేర్కొన్నారు.

హైవేపైనే వాహనాల పార్కింగ్

నక్కపల్లిలో ప్రతి శుక్రవారం వారపు సంత

» హైవేపై ఉదయం నుంచి ఇష్టానుసారంగా ఆటోలు, వ్యాన్లు, బైక్‌లు నిలిపివేత

» ప్రతి వారమూ ఇదే పరిస్థితి

» పట్టించుకోని పెట్రోలింగ్ సిబ్బంది

» దగ్గరుండి వాహనాలను క్రమబద్ధీకరించాలి

» ఆ దిశగా పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికుల వేడుకోలు


నక్కపల్లి వారపుసంత హైవే వద్ద ప్రతీ శుక్రవారం ఇదీ పరిస్థితి

నక్కపల్లి, ఆగస్టు 1: నక్కపల్లి హైవేపై ప్రతి శుక్రవారం భయానక పరిస్థితి నెలకొంటుంది. ఇక్కడ శుక్రవారం రోజున ఎండు చేపల వ్యాపారం కొన్ని రూ.లక్షల్లో జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగానే నక్కపల్లి ఎండు చేపల వ్యాపారానికి ఎంతో గుర్తింపు వుంది. సంతలో కూరగాయలు, మేకలు, గొర్రెల వ్యాపారం కూడా బాగానే జరుగుతుంది. అనేక ప్రాంతాలకు చెందిన కొనుగోలుదారులు, అమ్మకందారులు వారపుసంతకు వస్తుంటారు. హైవేకు ఆనుకునే వారపుసంత జరుగుతుంది. ప్రతి శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు హైవేపైనే ఇష్టమొచ్చినట్టు ఆటోలు, బైక్‌లు, వ్యాన్‌లను నిలిపివేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. హైవేకు సగభాగాన్ని ఆక్రమించే విధంగా వాహనాలను నిలిపివేస్తుండడంతో పాదచారులు, గ్రామీణులు వారపుసంతకు హైవేపై నడిచివెళ్లేందుకు భయపడుతుంటారు. హైవేపై ఇష్టమొచ్చినట్టు వాహనాలను నిలిపివేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అయితే హైవే పెట్రోలింగ్ సిబ్బంది వాహనాల నిలిపివేతను పట్టించుకోవడం లేదు. శుక్రవారం సంత రోజున హైవే పెట్రోలింగ్ సిబ్బంది అక్కడ ఉండి వాహనాలను క్రమబద్ధీకరించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. దీనివల్ల సంతకు వచ్చే వారికి, వాహనాలకు ఎటువంటి ప్రమాదం జరిగే అవకాశం ఉండదని వారంటున్నారు. ఈ విషయంలో పోలీస్ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


హైవేపై ఇష్టమొచ్చినట్టు వాహనాలు పార్కింగ్ చేస్తున్న దృశ్యం


పింఛన్ కోసం లబ్ధిదారుడిని డోలీలో కొరుప్రోలు నుంచి ఎంకేపట్నం తీసుకు వెళుతున్న దృశ్యం

పింఛన్ కోసం పాట్లు

» డోలీలో మూడు కిలో మీటర్లు వెళ్లాల్సిన దుస్థితి

» కొరుప్రోలు గ్రామస్థులకు తప్పని ఇబ్బందులు

రోలుగుంట, ఆగస్టు 1: పింఛన్ కోసం డోలీలో మూడు కిలో మీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి మండలంలోని ఎంకే పట్నం పంచాయతీ శివారు కొరుప్రోలులో నెలకొంది. గురువారం ఆ గ్రామానికి చెందిన గెమ్మెలి అప్పారావు(80)ను పింఛన్ కోసం కుటుంబ సభ్యులు మూడు కిలో మీటర్లు డోలీలో ఎంకేపట్నం సచివాలయానికి తీసుకువెళ్లారు. అతనితో పాటు మరో ఇద్దరిని కూడా గ్రామస్థులు డోలీలో తరలించారు. కొన్నేళ్లుగా డోలీలో వెళ్లి పింఛన్లు తీసుకుంటు న్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటికే పింఛన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఘనంగా మరిడిమాంబ జాతర


భక్తుల పూజలందుకున్న మరిడిమాంబ అమ్మవారు


అమ్మవారిని దర్శించేందుకు నదిలో పుట్టెపై వెళుతున్న భక్తులు

రాంబిల్లి, ఆగస్టు 1: మండలంలోని వైలోవ గ్రామ ఆరాధ్య దేవత మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరిగింది. గ్రామాన్ని ఆనుకొని ఉన్న శారదా నది ఆవతల ఒడ్డున కొలువైన అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించారు. శారదా నదిని పుట్టెలు, పడవలపై దాటివెళ్లి అమ్మవారిని దర్శించి, భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులు నదిని దాటే సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్పంచ్ బద్ది నారాయణరావు, గ్రామ పెద్దలు, యువకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

వరి నారుమడులను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి


వరినారు మడులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

కొత్తూరు, ఆగస్టు 1: అనకాపల్లి మండలం సీతానగరం గ్రామంలో వరి నారుమడులను జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడిలో జింక్ దాతులోపం ఎక్కువగా ఉం దని, దాని నివారణకు 200 గ్రాముల జింక్ సల్ఫేట్ రెండు దఫాలుగా పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వ్యవసాయాధికారి రామారావు, మండల వ్యవసాయాధికారి రంగాచారి, గ్రామ సహాయకులు జ్యోతిమోహన్, రైతులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్తపై కేసు నమోదు

» సహకరించిన అతని తల్లిపై కూడా..


బాధితురాలిని విచారిస్తున్న డీఎస్పీ

అచ్యుతాపురం, ఆగస్టు 1: ప్రేమ పేరుతో దళిత వితంతువుని వివాహం చేసుకొని, నాలుగు నెలలు కాపురం చేసిన తర్వాత ఆమెను వదిలించుకోవడానికి కత్తితో దాడి చేసిన భర్త, సహకరించిన అతని తల్లిపై కేసు నమోదు చేసినట్టు పరవాడ డీఎస్పీ కేవీ.సత్యనారాయణ తెలిపారు. డీఎస్పీ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోసెంపాలెంలో పలివెల భారతి (28) తన కుమార్తె, తల్లితో కలిసి నివాసముంటోంది. భారతికి 2016లో వివాహం అయింది. ఒక పాప కూడా ఉంది. ఆమె భర్త అనారోగ్యంతో 2021లో చనిపోవడంతో అప్పటి నుంచి ఆమె తల్లి ఇంటి వద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన ఆయినవిల్లి గణేష్ నూక అప్పారావు అలియాస్ వినయ్ రెండేళ్ల క్రితం పరిచయమయ్యాడు. 'నిన్ను ప్రేమిస్తున్నాను.. వివాహం చేసుకుంటాను.. ఇప్పుడు ఉన్న పాపను కూడా చక్కగా చూసుకుంటా'నని వెంట పడడంతో 2024 మార్చి 28న ఇద్దరు వివాహం చేసుకున్నారు. వివాహానంతరం అదే గ్రామంలో వీరు వేరు కాపురం పెట్టారు. వీరిద్దరిదీ కులాంతర వివాహం కావడంతో వినయ్ తల్లి భూలక్ష్మికి సుతారమూ ఇష్టలేదు. దీంతో భార్యను వదిలేయమని కొడుకు వినయ్‌ని తల్లి భూలోక వేధించడం ప్రారంభించింది. వినయ్ రోజు తాగి వచ్చి కులం పేరుతో భారతిని దూషించేవాడు. గతనెల 29న భూలక్ష్మి మరో మహిళతో కలిసి కోడలు భారతిని తిడుతూ తన కుమారుడిని వదిలేయమని ఒత్తిడి తెచ్చారు. ఈ విషయమై భారతి అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అక్కడ భార్యాభర్తలిద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. తర్వాత గత నెల 31న భారతిపై వినయ్ దాడి చేశాడు. దీంతో ఆమె మెడ, ఎడమ చేయి, మోచేయిపై గాయాలయ్యాయి.దీంతో భారతిని ఆమె తల్లి అచ్యుతాపురంలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించిందని డీఎస్పీ సత్యనారాయణ వివరించారు. విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ బుచ్చిరాజు ఎస్సీ, ఎస్టీ, అత్యాచారంతో పాటు ఇతర సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాంగనీస్ దిగుమతిలో విశాఖ పోర్టు రికార్డు

» జూలైలో 5,66,301 టన్నుల దిగుమతి

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు మాంగనీస్ దిగుమతిలో సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ ఏడాది మే నెలలో 17 నౌకల ద్వారా 4,37,270 టన్నుల మాంగనీస్‌ను దిగుమతి చేసుకోగా అప్పటికి అదే రికార్డు. దానిని జూలై నెలలో పోర్టు అధిగమించింది. గత నెలలో 15 నౌకల ద్వారా 5,66,301 టన్నుల మాంగనీస్‌ను దిగుమతి చేసుకొని కొత్త రికార్డు సృష్టించింది. పోర్టు 90 ఏళ్ల చరిత్రలో ఇదో మైలురాయి అని చైర్మన్ ఎం.అంగముత్తు తెలిపారు. ఈ ఘనత సాధించిన పోర్టు ట్రాఫిక్ విభాగాన్ని అభినందించారు.

సైన్యంలో చేరేవారికి అద్భుత అవకాశాలు



డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న వాయుసేన నాన్ కమాండింగ్ ఆఫీసర్ సందీప్

ఎలమంచిలి, ఆగస్టు 1 : సైన్యంలో చేరాలని ఆసక్తి ఉన్న యువతరానికి భారతీయ వాయుసేన ఆహ్వానం పలుకుతుందని వాయుసేన నాన్ కమాండింగ్ ఆఫీసర్ సందీప్ పిలుపునిచ్చారు. ఇక్కడి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం అగ్నివీర్ పథకంపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఇంటర్ పూర్తి చేసిన సైన్స్, సైన్సేతర విద్యార్థులు భారతీయ సైన్యం అగ్నివీర్‌లుగా చేరేందుకు అవకాశం ఉంటుందన్నారు. నాలుగు సంవత్సరాల ఈ శిక్షణలో చక్కని వేతనాలతో పాటు చదువుకునే అవకాశాన్ని కూడా కల్పిస్తారన్నారు. నాలుగు సంవత్సరాల తరువాత డిగ్రీతో పాటు చక్కని నగదు ప్రోత్సాహకం అందుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ప్రతిభ చూపే అగ్నివీరులకు 25 శాతం తదుపరి సైన్యంలో అవకాశాన్ని కల్పిస్తారని వివరించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల జేకేసీ కో-ఆర్డినేటర్ పి.వెంకన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలపై కొణతాలకు ఆశ కార్యకర్తలు వినతి



కొణతాలకు సమస్యలు వివరిస్తున్న కార్యకర్తలు

కొత్తూరు, ఆగస్టు 1 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు గురువారం ఆశ కార్యకర్తల వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయిందన్నారు. కూటమి ప్రభుత్వంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆశ వర్కర్లపై పనిఒత్తిడి తగ్గించాలని, సంక్షేమ పథకాలు ఆశ వర్కర్లందరికీ అమలు చేయాలని విన్నవించారు. రిటైర్డ్ అయిన ఆశ కార్యకర్తలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఆశ కార్యకర్తల పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, యూనియన్ కోశాధికారి సూర్యకుమారి, సిహెచ్.వెంకటలక్ష్మి, ఆడారి అన్నపూర్ణ, నాగమణి, విజయ, భవానీ పాల్గొన్నారు.

'మహిళలపై అరాచకాలకు అడ్డుకట్ట వేయాలి'

తుమ్మపాల, ఆగస్టు 1: రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై జరుగుతున్న అరాచకాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని పీడీఎస్‌వో రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రోజు రోజుకి అరాచకాలు పెరిగిపోతున్నాయన్నారు. మత్తు పదార్థాలు, మద్యం, గంజాయి వంటివి అరికట్టాలని కోరారు. నాయకులు ఎస్.భాస్కర్, ఎం.గరగ నాయుడు, ఎ.సాయి, ఎం.కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్చ్.. మళ్లీ వదిలేశారు



ఫార్మా వ్యర్థాలను పరిశీలిస్తున్న తాడి గ్రామస్థులు

- రాంకీ పంపుహౌస్ సమీపం గెడ్డలోకి పెద్ద ఎత్తున విడుదల చేసిన ఫార్మా వ్యర్థాలు
- దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న తాడి గ్రామస్థులు



గెడ్డ ద్వారా పారుతున్న ఫార్మా వ్యర్థాలు

పరవాడ, ఆగస్టు 1 : ఫార్మాసిటీలోని కొన్ని ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు బరితెగింపు చర్యలకు పాల్పడుతున్నాయి. మొన్న పరవాడ మల్లోడిగెడ్డలోకి, నిన్న పరవాడ పెద్ద చెరువులోకి వ్యర్థ జలాలు విడిచిపెట్టిన యాజమాన్యాలు గురువారం తాడి గ్రామానికి ఆనుకుని ఉన్న రాంకీ పంప్‌హౌస్ సమీపంలో గల గెడ్డలోకి వ్యర్థ జలాలను పెద్ద ఎత్తున విడిచిపెట్టారు. దీంతో ఆ ప్రాంతమంతా భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ప్రజలతో పాటు జీవరాసులకు హాని కలిగించేటట్టు వంటి వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టడం ఇటీవల ఫార్మా యాజమాన్యాలకు అలవాటుగా మారింది. పీసీబీ, రాంకీ యాజమాన్యాల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యర్థ జలాలను బయటకు విడిచిపెట్టేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ గెడ్డకు ఆనుకుని ఏలేరు కాలువ ఉంది. దీనిద్వారా పరిశ్రమలకు అవసరమైన తాగునీరు అందిస్తుంది. ప్రస్తుతం ఈ గెడ్డకు ఏలేరు కాలువకు దూరం వంద మీటర్ల లోపే ఉంటుంది. గెడ్డల ద్వారా వ్యర్థజలాలను విడిచిపెట్టడం వల్ల భూగర్భ జలాలు కలుషితమైపోతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలావుంటే, గెడ్డ ద్వారా పారుతున్న వ్యర్థ జలాలను తాడి గ్రామస్థులతో కలిసి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పరిశీలించారు. ఫార్మా యాజమాన్యాలతో పాటు రాంకీ యాజమాన్యానికి ప్రజల ప్రాణాలంటే లెక్కలేకుండా పోయిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గళ్లా భార్గవ్, సాలాపు భాస్కర్, కోమటి గురుమూర్తి, శ్రీను, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బకాయిల కోసం ఉపాధి కూలీలు ఆందోళన



పంచదార్ల సచివాలయం వద్ద కూలీల నినాదాలు

రాంబిల్లి, ఆగస్టు 1 : ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించిన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పంచదార్ల సచివాలయం వద్ద పలువురు కూలీలు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు మాట్లాడుతూ ఈ పంచాయతీలో సుమారు మూడు వందల నుంచి నాలుగు వందల మంది వరకు ఉపాధి కూలీలు పనిచేస్తున్నారన్నారు. వీరికి రెండు వారాల నుంచి పదివారాల వరకు పనులకు సంబంధించిన బకాయిలు చెల్లించలేదని ఆరోపించారు. దీంతో వీరంతా కష్టపడి పనిచేసినప్పటికీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి బకాయిలను విడుదల చేసేలా చర్యలు చేపట్టాల్సిందిగా ఆయన కోరారు. అలాగే, బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, రెండు వందల రోజుల పనిదినాలను కల్పించాలని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు సంబంధించి రోజు కూలి ఆరు వందల రూపాయలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల కన్వీనర్ చందక రామకృష్ణ, నాయకులు అప్పారావు, వెంకినాయుడు, సత్తిబాబులతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి'



దోసూరులో ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఎలమంచిలి, ఆగస్టు 1 : భవన నిర్మాణ కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితిసభ్యుడు గనిశెట్టి ఏసుదాసు కోరారు. గురువారం ఇక్కడ జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించడంతో పాటు వారి సమస్యలు పరిష్కరించాల్సిందిగా కోరారు. స్థానిక సంఘం అధ్యక్షుడు ఎ.శంకరరావు, ప్రతినిధులు జయకృష్ణ, గణేశ్, రామశేషు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. కొండకర్ల, దోసూరు గ్రామాల్లో గురువారం నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అప్పలనాయుడు, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటలో ఘనంగా దుర్గమ్మ పండగ



తిమ్మరాజుపేటలో దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

అచ్యుతాపురం, ఆగస్టు 1 : తిమ్మరాజుపేట గ్రామంలో దుర్గమ్మవారి పండగ గురువారం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. హరిపాలెం, తిమ్మరాజుపేట, పెదపాడు తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త శరగడం జగ్గారావు, లక్ష్మి దంపతులు తొలిపూజ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చేపల బజారులో గంగమ్మతల్లి జాతర

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1 : పట్టణంలోని చేపల బజారు వద్ద గంగపుత్రుల ఆధ్వర్యంలో గురువారం గంగమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరిని నిర్వాహకులు సత్కరించారు. అనంతరం సాయంత్రం గంగమ్మతల్లిని మెయిన్‌రోడ్డు మీదుగా ఊరేగించారు. తప్పెటగుళ్లు, నేలవేషాలతో ఊరేగింపుగా శారదానది ఒడ్డుకు వెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు సిరసపల్లి ఆదిబాబు, సూరిబాబు, రాజుతో పాటు గంగపుత్రులు, మహిళలు పాల్గొన్నారు.

'ప్రశాంత వాతావరణంలో ఎస్ఎంసీ ఎన్నికలు'



హెచ్‌ఎంలను ఉద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

ఎస్.రాయవరం, ఆగస్టు 1: ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల ఎనిమిదో తేదీన నిర్వహించే పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలను సజావుగా నిర్వహించాలని ఎలమంచిలి డిప్యూటీ డీఈవో పొన్నాడ అప్పారావు సూచించారు. ఎస్.రాయవరం ఎంఈవో ఏఎస్ఎస్ఏఎస్ మూర్తి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు జరపాలన్నారు. ఎక్కడా ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా చూడాలని సూచించారు. ఎంఈవో మూర్తి మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేలా కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యాబోధన నుంచి పిల్లలకు వడ్డించే మధ్యాహ్న భోజనం వరకు అన్ని సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి

ఎలమంచిలి, ఆగస్టు 1 : ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు అన్నారు. గురువారం ఆయన మునిసిపాలిటీ పరిధిలోని సోమలింగపాలెం వార్డులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. తొలుత ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు పలువురు విద్యార్థుల నోట్ పుస్తకాలు తనిఖీ చేసి, వారికి ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం హెచ్‌ఎం సాయిబాబా, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బయ్యవరంలో పసరుమారమ్మ వేడుక

కశింకోట, ఆగస్టు 1 : బయ్యవరంలో పసరుమారమ్మ పండగను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల గుండా ఘటాలను ఊరేగింపుగా తీసుకు వెళ్లి గ్రామ శివారులో ఉన్న పొలిమేరలో ఉంచారు. ప్రధానంగా ఈ పండగ రైతుల పంటలు పుష్కలంగా పండాలనే ఉద్దేశంతో ఏటా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వారి ఆధ్వర్యంలో ఈ వేడుకను జరిపారు.

'అర్హులందరికీ సంక్షేమ పథకాలు'

మునగపాక (తుమ్మపాల), ఆగస్టు 1 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడమే టీడీపీ శ్రేణుల లక్ష్యం కావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో జరిగిన నాయకుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో 96.62శాతం పింఛన్ల పంపిణీ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1 : పట్టణంలో గురువారం ఉదయం ప్రారంభమైన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 96.62 శాతం పూర్తయింది. తెల్లవారుజాము ఐదు గంటలకే సచివాలయ ఉద్యోగులు ఆయా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల నగదును పంపిణీ చేశారు. జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు కూడా గవరపాలెం, గొల్లవీధి, గాంధీనగరం ప్రాంతాల్లో పలువురి ఇళ్లకు వెళ్లి పింఛన్లను అందించారు.

పెన్షన్ల పంపిణీ పరిశీలించిన డీఆర్‌డీఏ పీడీ

ఎస్.రాయవరం, ఆగస్టు 1 : మండలంలోని జేవీపాలెం, సర్వసిద్ధి గ్రామాల్లో నిర్వహించిన పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి గురువారం పరిశీలించారు. పెన్షన్ పంపిణీ విధానం ఏ విధంగా సాగుతున్నది సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి పలు సూచనలు చేశారు.

దేవాలయ భూములను పరిరక్షించాలి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1 : ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలో ఉన్న సర్వే నంబరు 66లోని 29.71 ఎకరాల సీతారామచంద్రస్వామి దేవస్థానం భూములు ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, మండల కన్వీనర్ గంటా శ్రీరామ్‌లు భూములకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కొంతమంది ఈ భూములను కాజేయాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజా పోరాటం తప్పదని స్పష్టం చేశారు. దేవాలయ భూములను పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, తేలయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.



అమ్మపాలు అమృతం

- వారోత్సవాల ప్రారంభోత్సవ ర్యాలీలో వక్తలు



అనకాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



తుమ్మపాల గ్రామంలో...



కోటవురట్లలో...



రాంబిల్లి మండలం దిమిలిలో...

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1 : తల్లిపాల వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కె.చంద్రశేఖర్‌దేవ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి పాలే బిడ్డకు శ్రేష్ఠమన్నారు. ఈ కార్యక్రమంలో గణాంక శాఖాధికారి రామచంద్రరావు, హెల్త్ ఎడ్యుకేటర్ శివరామకృష్ణ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : పాపయ్యపాలెం, తుమ్మపాల తదితర గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ నీలిమ తల్లిపాల విశిష్టతను ఆయా గ్రామస్థులకు వివరించారు. వైద్య సిబ్బంది డి.శారద, హెచ్‌వీ మరియమ్మ పాల్గొన్నారు.

కశింకోట: తల్లిపాల విశిష్టతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పి.ప్రభావతి అన్నారు. గురువారం మండలంలోని తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం -3లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. వైద్యాధికారి యు.రమేష్, ఆరోగ్య విస్తరణాధికారి సుబ్బారావు, ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు వి.సుచరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటవురట్ల : మండల కేంద్రం కోటవురట్లలో తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.జీవన్‌రావు, అనకాపల్లి కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇస్తేర్‌రాణి, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం: హరిపాలెం పీహెచ్‌సీ పరిధిలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వసంత కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేష్, లక్ష్మి, గణేష్, ఇందిరా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాంబిల్లి: దిమిలిలో పీహెచ్‌సీ వైద్యాధికారులు ఆర్.వెంకటేష్, బాలగంగా శ్రావణి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎస్ఎస్‌వీఎన్ రాజు, ఆరోగ్య పర్యవేక్షకులు సిహెచ్.ధనరాజు, ఉమామహేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ రేష్మలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణకు అనుకూల తీర్పుపై సంబరాలు



సబ్బవరంలో సంబరాలు



పాయకరావుపేటలో స్వీట్లు తినిపించుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాయకరావుపేట, ఆగస్టు 1 : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు గురువారం తీర్పు ఇవ్వడంపై పాయకరావుపేటలో పలువురు దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గంపల చినరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టులో అనుకులంగా తీర్పు రావడం అభినందనీయమన్నారు. సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మలపల్లి లక్ష్మణరావు, సలికే అచ్చియ్య, కుందూరు రాజా, తుమ్మలపల్లి కుమార్, సతీష్, వేమగిరి లక్ష్మణరావు, బొడ్డపాటి సతీష్, ఆరుగుల రమేష్, ముంజులూరి దుర్గాప్రసాద్, సలికే గోవింద్, ఆరుగుల రమణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం శుభ పరిణామమని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రవిరాజు అన్నారు.

తుమ్మపాల : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలక మల్లిబాబు అన్నారు.. గురువారం అరుంధతినగర్‌లో అరుంధతి సేవా సంఘం సభ్యుల సమావేశంలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. అనంతరం మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు టి.శ్రీనివాసరావు, పాత్రపల్లి వీరుయాదవ్, చినఅప్పారావు, మంగరాజు పాల్గొన్నారు.

కోటవురట్ల : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంపై కోటవురట్ల శివారు రాట్నాలపాలెంలో బాబు జగ్జీవన్‌రామ్ యూత్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఎన్నో ఏళ్లుగా వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో చేసిన అనేక ఉద్యమాలు నేటికి ఫలించాయన్నారు. గంటేడ అప్పలరాజు, మునగాడ దాసు, గంటేడ చిరంజీవి, పెదపూడి అప్పారావు, కాండ్రకోట అర్జున్, లోవరాజు పాల్గొన్నారు.

సబ్బవరం : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐడి బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు దశాబ్దాల పోరాటానికి ఫలితం లభించిందని వివరించారు. అలాగే, సుప్రీం కోర్టు తీరుపై ఎమ్మార్పీఎస్ శ్రేణులు ప్రధాని మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు సబ్బవరంలో పాలాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామ్రాట్‌కుమార్, నాయకులు ఇండిగుబిల్లి గోపి, బొర్రా జయరాజు, దువ్వ దుర్గాలు, గొటివాడ సన్యాసి, కొమ్ము కోటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సాగునీటి వనరులు కలుషితం

... 5వ పేజీ తరువాయి

వ్యర్థ జలాల వాసన వెదజల్లుతోంది. పీసీబీ అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపేసుకోవడం తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఫార్మా యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెడుతున్నాయి.

చెరువు నీరు పూర్తిగా కలుషితం



ఫార్మా వ్యర్థాలను శుద్ధి చేయకుండా చెరువులోకి విడిచిపెడుతున్నారు. ఈ కారణంగా నీరు నల్లగా మారిపోవడంతో పాటు పూర్తిగా కలుషితమైపోయింది. ఒకటే దుర్వాసన. చెరువు సమీపంలోకి వెళ్లలేకపోతున్నాం. ఫార్మా యాజమాన్యాలు, రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ పరిస్థితి నెలకొంది.

- రెడ్డి శ్రీనివాసరావు, పెద్దచెరువు ఆయకట్టు రైతు సంఘం అధ్యక్షుడు

అధికారులు పట్టించుకోవడం లేదు



పెద్ద చెరువులోని నీరు కలుషితమైపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారు. రైతుల బాధలను అర్థం చేసుకోవడం లేదు. ఇప్పటికే భూగర్భ జలాలు కలుషితమైపోయాయి. ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది.

- సిరపురపు అప్పలనాయుడు, సర్పంచ్, పరవాడ

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పెద్ద చెరువులోని నీరు కలుషితమైన విషయం నా దృష్టికి వచ్చింది. చెరువును పరిశీలించి కలుషితం కావడానికి గల కారణాలను తెలుసుకుంటాం. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు చేపడతాం. వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టడం చట్టరీత్యా నేరం. వ్యర్థాలు బయటకు విడిచిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటాం.

- పీవీ ముకుందరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ

పాఠశాలలకు యాజమాన్య కమిటీలు

... 5వ పేజీ తరువాయి

అదే పాఠశాలలో చదువుతుంటేనే తండ్రికి కమిటీలో అర్హత కల్పిస్తారు. కమిటీల నేతృత్వంలోనే ఇకపై పాఠశాలలో మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాల కల్పన పనుల పర్యవేక్షణ ఉంటుంది. జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 8న యాజమాన్య కమిటీల నియామకాల కోసం ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తామని డీఈవో ఎంవీ లక్ష్మమ్మ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి, ఎన్నికలు సజావుగా జరిగేలా మండల విద్యాశాఖాధికారులకు స్పష్టమైన ఉత్తర్వులు, మార్గదర్శకాలను జారీ చేశామని చెప్పారు.

వైసీపీలో ఎమ్మెల్సీ టికెట్ రేస్

... 5వ పేజీ తరువాయి

తనకు అవకాశం ఇవ్వాలని, అందుకు కావాల్సిన అర్హతలన్నీ తనకు ఉన్నాయని పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి వద్ద బలంగా డిమాండ్ చేసినట్టు తెలిసింది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా తాను భారీగా ఖర్చు చేసి కార్యక్రమాలు నిర్వహించానని చెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలో పార్టీ నేతలందరితో సమావేశం ఏర్పాటుచేసి అభిప్రాయ సేకరణ జరిపి పార్టీ అధ్యక్షునికి నివేదిక సమర్పిస్తానని సుబ్బారెడ్డి స్పష్టం చేసినట్టు తెలిసింది. జగన్ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని తనను కలిసిన ఆశావహులకు సుబ్బారెడ్డి చెబుతున్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు

ఘనంగా తల్లిపాల దినోత్సవం



కృష్ణాదేవిపేటలో నిర్వహిస్తున్న ర్యాలీ

కృష్ణాదేవిపేట, ఆగస్టు 1 : పుట్టిన బిడ్డకు తల్లిపాలతోనే సంపూర్ణ మానసిక వికాసం సాధ్యమని కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎన్.హరిప్రవీణ్, గాయత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం స్థానిక పీహెచ్‌సీ నుంచి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ సావిత్రి, ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ, హెచ్‌వీలు వరలక్ష్మి, నాగమణి, పద్మ, ప్రశాంతి, లక్ష్మి, లావణ్య, చిట్టిబాబు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని గొలుగొండ, చీడిగుమ్మల పీహెచ్‌సీలు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని వైద్యాధికారి శ్యామ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ధనుంజయ్, మధుసూదన్‌రావు, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీగౌరి తదితరులు పాల్గొన్నారు.



గొలుగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

పోలీసుల తీరుపై దళిత రైతుల నిరసన

- పట్టా భూముల్లో సాగు చేస్తుంటే అడ్డుకుంటున్నారంటూ ఆరోపణ
- పంట పొలాల్లో ఆందోళన

గొలుగొండ, ఆగస్టు 1 : సీలింగ్ భూములకు పట్టాలు ఉన్నప్పటికీ భూముల్లో సాగు చేసుకుంటున్న తమను పోలీసులు అడ్డుకుంటున్నారని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం పలువురు దళితులు ఆందోళన చేపట్టారు. మండలంలోని కృష్ణాదేవిపేట రెవెన్యూ పరిధిలో సుమారు నలభై ఏళ్ల క్రితం సీలింగ్ భూములను కృష్ణాదేవిపేటకు చెందిన 30 మంది దళితులు, గిరిజనులు, బీసీలకు చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 సెంట్లు చొప్పున భూమికి పట్టాలు మంజూరు చేశారని పట్టాదారులు ఆరోపించారు. అప్పటి నుంచి తమ కుటుంబీకులే సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నామన్నారు. గత నెలలో వరినారు మడులు సిద్ధం చేశామని, నాలుగు రోజుల నుంచి వరినాట్లుకు దమ్ములు చేసేందుకు ట్రాక్టర్ పొలంలోకి తీసుకువెళితే కృష్ణాదేవిపేట



పంట పొలాల్లో నిరసన తెలుపుతున్న రైతులు

పోలీసులు అడ్డుకుంటున్నారని గొలుగొండ ఇన్‌చార్జి తహసీల్దార్ భరత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. తమకు న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తమకు న్యాయం జరగకపోతే పోలీసులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, త్వరలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలుస్తామని బాధిత కుటుంబాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో బాధితులు ముప్పల నూకాలమ్మ, మంజేటి గైరమ్మ, అయినవల్లి నూకాలమ్మ, పోతల నూకరాజు, జిల్లేడపూడి వరలక్ష్మితోపాటు సుమారు 15 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ విషయమై కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్రను అడగ్గా.. సీలింగ్ భూములపై కౌలు రైతులు హైకోర్టు నుంచి ఆదేశాలు తేవడంతో పట్టాదారులు, కౌలు రైతులకు వివాదం నెలకొందని తెలిపారు.

వైసీపీ హయాంలో పింఛనుదారులకు తీవ్ర అన్యాయం

రాష్ట్ర పింఛన్‌దారుల సంఘం కార్యదర్శి మోహనరావు

మాకవరపాలెం, ఆగస్టు 1 : రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌దారులకు గత ప్రభుత్వ హయాంలో ప్రకటించిన పీఆర్‌సీలో తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర పింఛనుదారుల సంఘం అదనపు కార్యదర్శి సీహెచ్ మోహనరావు అన్నారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. గురువారం తామరంలో పింఛన్‌దారుల 19వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ పింఛనుదారులకు న్యాయంగా రావాల్సిన బకాయిలను చెల్లించాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులు సంఘంలో చేరి సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా పింఛనుదారుల సంఘం అధ్యక్షుడు డీడీ ప్రసాదరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు జగన్నాథరావు, సంఘం కార్యదర్శి కృష్ణమూర్తి, మాకవరపాలెం సంఘం మండల అధ్యక్షులు కోసూరు రామరావు, రంగరాజు, అచ్చేశ్వరావు, పెద్ద ఎత్తున పింఛన్‌దారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

రైతు ఉద్యమ నేత మాకిరెడ్డి దేముడు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

నర్సీపట్నం, ఆగస్టు 1 : పంచాయతీ నుంచి రైతు ఉద్యమాలు వరకు ఎర్ర జెండా పక్కన నిలబడి చివరి వరకు పోరాడిన ఉద్యమ నేత మాకిరెడ్డి దేముడు అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం సీపీఐ సీనియర్ నేత దేముడు ప్రథమ వర్ధంతిని ఆయన స్వగ్రామం గబ్బాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ దేముడు 98 ఏళ్ల వయసులో కూడా చివరి వరకు పార్టీ సిద్ధాంతం కోసం పని చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో భాగంగా దేముడు స్థూపం నుంచి ఆయన నివాసానికి ర్యాలీగా చేరుకొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, కొయ్యూరు జెడ్పీటీసీ వారా నూకరాజు, సీపీఐ ప్రజా సంఘ జిల్లా నాయకురాలు గంగాభవాని, జి గురుబాబు, ఎల్‌వీ రమణ పాల్గొన్నారు.



దేముడుకు జోహార్లు అర్పిస్తున్న సత్యనారాయణమూర్తి

పాఠశాల ఎన్నికలకు నోటిఫికేషన్

మాకవరపాలెం, ఆగస్టు 1 : మండలంలో గురువారం పాఠశాల ఎన్నికల నియమాల పట్టికను అన్ని పాఠశాల్లోని విద్యార్థుల సంఖ్యలకు సంబంధించిన జాబితాలను గోడలపై అతికించామని మండల విద్యాశాఖ అధికారి పీఎస్ఎన్ మూర్తి అన్నారు. ఈ నెల 8న మధ్యాహ్నం ఒంటి గంటలోగా తరగతుల వారీగా ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. అదే రోజు మూడు గంటలలోపు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు.

సాగునీటి కాలువకు గండి



గిడుతూరు కాలువకు పడిన గండి

మాకవరపాలెం, ఆగస్టు 1 : గిడుతూరు సాగునీటి కాలువకు గండి పడటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మల్లవరం కాలువ చానల్ నుంచి గిడుతూరు చుక్కలయ్య చెరువుకు సాగునీటి కాలువ ద్వారా సాగునీరు వస్తుంది. ఈ చెరువు ద్వారా సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే ఈ చానల్ ద్వారా వచ్చే సాగునీటి కాలువకు గండిపడటంతో సాగునీరు అంతా తిరిగి వరహానదిలోకి పోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అసలే వరినాట్లు వేసేందుకు దమ్ములు చేస్తున్న సమయంలో సాగునీటి కాలువకు గండిపడటం ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు. ఈ కాలువ ద్వారా వచ్చే సాగునీరుతో గిడుతూరు, మల్లవరం తదితర భూముల్లో వరిసాగు చేస్తామని రైతులు చెబుతున్నారు. అయితే గత వారం రోజుల కిందట సాగునీటి కాలువకు గండిపడటంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ నీటి ఉధృతికి మళ్లీ గండి పడిందని, దీంతో దమ్ములకు నీరు అందడంలేదని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గండికి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పాఠశాలలకు యాజమాన్య కమిటీలు

... 5వ పేజీ తరువాయి

అదే పాఠశాలలో చదువుతుంటేనే తండ్రికి కమిటీలో అర్హత కల్పిస్తారు. కమిటీల నేతృత్వంలోనే ఇకపై పాఠశాలలో మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాల కల్పన పనుల పర్యవేక్షణ ఉంటుంది. జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 8న యాజమాన్య కమిటీల నియామకాల కోసం ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తామని డీఈవో ఎంవీ లక్ష్మమ్మ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి, ఎన్నికలు సజావుగా జరిగేలా మండల విద్యాశాఖాధికారులకు స్పష్టమైన ఉత్తర్వులు, మార్గదర్శకాలను జారీ చేశామని చెప్పారు.

వైసీపీలో ఎమ్మెల్సీ టికెట్ రేస్

... 5వ పేజీ తరువాయి

తనకు అవకాశం ఇవ్వాలని, అందుకు కావాల్సిన అర్హతలన్నీ తనకు ఉన్నాయని పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి వద్ద బలంగా డిమాండ్ చేసినట్టు తెలిసింది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా తాను భారీగా ఖర్చు చేసి కార్యక్రమాలు నిర్వహించానని చెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలో పార్టీ నేతలందరితో సమావేశం ఏర్పాటుచేసి అభిప్రాయ సేకరణ జరిపి పార్టీ అధ్యక్షునికి నివేదిక సమర్పిస్తానని సుబ్బారెడ్డి స్పష్టం చేసినట్టు తెలిసింది. జగన్ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని తనను కలిసిన ఆశావహులకు సుబ్బారెడ్డి చెబుతున్నారు.

సాగునీటి వనరులు కలుషితం

... 5వ పేజీ తరువాయి

వ్యర్థ జలాల వాసన వెదజల్లుతోంది. పీసీబీ అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపేసుకోవడం తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఫార్మా యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెడుతున్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పెద్ద చెరువులోని నీరు కలుషితమైన విషయం నా దృష్టికి వచ్చింది. చెరువును పరిశీలించి కలుషితం కావడానికి గల కారణాలను తెలుసుకుంటాం. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు చేపడతాం. వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టడం చట్టరీత్యా నేరం. వ్యర్థాలు బయటకు విడిచిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటాం.

- పీవీ ముకుందరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ

చెరువు నీరు పూర్తిగా కలుషితం



ఫార్మా వ్యర్థాలను శుద్ధి చేయకుండా చెరువులోకి విడిచిపెడుతున్నారు. ఈ కారణంగా నీరు నల్లగా మారిపోవడంతో పాటు పూర్తిగా కలుషితమైపోయింది. ఒకటే దుర్వాసన. చెరువు సమీపంలోకి వెళ్లలేకపోతున్నాం. ఫార్మా యాజమాన్యాలు, రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ పరిస్థితి నెలకొంది.

- రెడ్డి శ్రీనివాసరావు, పెద్దచెరువు ఆయకట్టు రైతు సంఘం అధ్యక్షుడు

అధికారులు పట్టించుకోవడం లేదు



పెద్ద చెరువులోని నీరు కలుషితమైపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారు. రైతుల బాధలను అర్థం చేసుకోవడం లేదు. ఇప్పటికే భూగర్భ జలాలు కలుషితమైపోయాయి. ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది.

- సిరపురపు అప్పలనాయుడు, సర్పంచ్, పరవాడ



చోడవరం
నియోజకవర్గం

సీఎం దృష్టికి కార్మికుల సమస్యలు

- వైసీపీ ఐదేళ్ల పాలనలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిర్వీర్యం
- నిధులు దారి మళ్లింపుతో తీరని అన్యాయం
- కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి ఆదుకోవాలి
- కార్మికుల సమావేశంలో ఏఐటీయూసీ ప్రతినిధులు

చోడవరం, ఆగస్టు 1 : రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటైన కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక వినాయక ఆలయం వద్ద భవన నిర్మాణ కార్మికులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు ఉపయోగపడే సంక్షేమ బోర్డును గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కార్మికుల సంక్షేమ బోర్డు నుంచి రూ.18 వందల కోట్ల నిధులను నవరత్నాల పథకాలకు దారిమళ్లించి కార్మికులకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరారు. దీనిపై సీఎం చంద్రబాబునాయుడుకు, మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వనున్నామన్నారు. నాయకులు నేమాల హరి, సంఘం స్థానిక అధ్యక్షులు కోన నూకరాజు, గువ్వల కనకారావు, నారం మధు, దేముడు, గోవింద, అప్పారావు, శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వానికి ఏఐటీయూసీ జిల్లా నాయకులు బర్నికాన దేముడు విజ్ఞప్తి చేశారు. గురువారం దిబ్బిడిలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, ప్రమాద, సహజ మరణం పొందిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు పరిహారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు వియ్యపు రాము, జాగారపు అప్పారావు, బి.రాజు, వెంకటేష్, సత్యనారాయణ, నర్సింగరావు పాల్గొన్నారు.



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న కోన లక్ష్మణ

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కిరణ్‌కుమార్



చోడవరం, ఆగస్టు 1 : ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన టి.రాధాకృష్ణ పదవీ విరమణ చేయడంతో అతని స్థానంలో వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న కిరణ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కాగా కళాశాలలో పదవీ విరమణ చేసిన ప్రిన్సిపాల్ రాధాకృష్ణతో పాటు, మరో లెక్చరర్ రఫియుద్దీన్‌ను లెక్చరర్లు ఘనంగా సత్కరించారు.



తల్లిపాల విశిష్టతపై అవగాహన ర్యాలీలు



రావికమతం మండలం కొత్తకోట, రోలుగుంట పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీల దృశ్యం

రావికమతం : పుట్టిన గంటలోనే బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం అమృతంతో సమానమని కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రజని అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం కొత్తకోటలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి సురేఖ, ఆరోగ్య విస్తరణాధికారి రామారావు, హెచ్‌వీ ఎర్రమ్మ, ఎంఎల్‌పీలు, అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట : తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రోలుగుంటలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రావణి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు ఆహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీహెచ్ఈవో కృష్ణ, పీహెచ్ఎస్ సరస్వతి, హెచ్ఎస్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా పోలీసులు గురువారం ఇక్కడ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతను పలువురు గర్భిణిలు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని కోనాం గ్రామంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు, హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు : డీపీవో

రోలుగుంట, ఆగస్టు 1 : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి సూచించారు. రోలుగుంటతో పాటు కంచుగుమ్మలలో గురువారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లోని సంపద కేంద్రాలను పరిశీలించి సూచనలు చేశారు. డీఎల్‌పీవో మూర్తి, ఈవోపీఆర్డీ నూకరాజు, కార్యదర్శి రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

96 శాతం పింఛన్లు పంపిణీ

బుచ్చెయ్యపేట : మండలంలో తొలిరోజు గురువారం 96 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేశామని మండల ప్రత్యేకాధికారిణి, డీపీవో శిరీషారాణి తెలిపారు. వడ్డాదిలో దివ్యాంగ యువకుడుకి పింఛన్ నగదును అందించిన అనంతరం మాట్లాడారు. వేకువజాము నుంచే ఈ ప్రక్రియను ప్రారంభించినట్టు చెప్పారు. ఆమె వెంట ఎంపీడీవో వెంకటాచార్యులు, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, వడ్డాది పంచాయతీ ఈవో లవరాజు తదితరులు ఉన్నారు.



వడ్డాదిలో పింఛన్ అందిస్తున్న డీపీవో శిరీషారాణి

'కార్మికుల బకాయిలు చెల్లించకుంటే చర్యలు'

చోడవరం, ఆగస్టు 1 : వ్యాపార సంస్థల్లో పనిచేసే కార్మికులకు బకాయిల చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహించే యజమానులపై చర్యలు తీసుకుంటామని స్థానిక సహాయ కార్మిక శాఖ అధికారి పి.సూర్యనారాయణ హెచ్చరించారు. చట్టప్రకారం ఏ కార్మికుడినైనా యజమాని బలవంతంగా పని నుంచి మానిపించినా, లేదా కార్మికుడు తన ఇష్టపూర్వకంగా పనిమానివేసినా అతనికి రావలసిన నష్టపరిహారం పొందడానికి అర్హత ఉంటుందని తెలిపారు. ఆడ, మగ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక సాయిశ్రీ థియేటర్‌లో గతంలో స్వీపర్‌గా పనిచేసిన జలగడుగుల రమణ అనే కార్మికుడిని యాజమాన్యం తొలగించగా, అతనికి రావలసిన నష్టపరిహారం రూ.60 వేల చెక్కును సహాయ కార్మిక శాఖ అధికారి గురువారం అందజేశారు.

పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీలకు ఎన్నికలు

చోడవరం, ఆగస్టు 1 : మండలంలోని పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీలకు ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎంఈవో కె.సింహాచలం గురువారం విడుదల చేశారు. మండల వ్యాప్తంగా 42 ప్రాథమిక పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలు, 14 హైస్కూళ్లకు మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు ఈనెల ఎనిమిదో తేదీన నిర్వహించనున్నారు.

వడ్డాది కళాశాల వద్ద గోతులు పూడ్చివేత

బుచ్చెయ్యపేట, ఆగస్టు 1 : టీడీపీ వడ్డాది పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్ తన సొంత నిధులతో బీఎన్ రోడ్డులోని వడ్డాది కళాశాల వద్ద గోతులను గురువారం పూడ్చివేయించారు. ఈ రోడ్డులో ఇక్కడ గోతులు ప్రమాదకరంగా మారాయి. పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. ఇది గుర్తించి చోడవరం ఎమ్మెల్యే రాజు సూచన మేరకు ఈ చర్యలను చేపట్టారు. దీంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయాల భూముల కౌలు వేలం రేపు

చోడవరం, ఆగస్టు 1 : చీడికాడలోని రామాలయం, శ్యామలాంబ ఆలయాలకు చెందిన భూములలో జీడి తోటల కౌలు వేలం శనివారం నిర్వహిస్తున్నట్టు దేవదాయ శాఖ ఈవో ఎస్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. 12.78 ఎకరాల భూముల్లోని జీడితోటల కౌలు వేలంలో పాల్గొనదలచినవారు, ఆ రోజు చీడికాడ రామాలయం వద్ద ఉదయం 11 గంటలకు నిర్వహించే బహిరంగ వేలంకు హాజరుకావాలని ఈవో కోరారు.



మాడుగుల
నియోజకవర్గం

'కోనాం' నుంచి సాగు నీరు విడుదల



దిగువ కాలువ గేటు వద్ద రామానాయుడు పూజలు

చీడికాడ, ఆగస్టు 1: కోనాం పాలవెల్లి జలాశయం నుంచి ఎగువ, దిగువ కాలువల ద్వారా 200 క్యూసెక్కుల సాగునీటిని నీటి పారుదలశాఖ డీఈఈ చింతల వేణుగోపాలనాయుడు, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, కోనాం జలాశయం మాజీ చైర్మన్ గండి ముసలినాయుడు గురువారం గేట్లు ఎత్తి విడుదల చేశారు. అంతకు ముందు రెండు కాలువల గేట్లు వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ జలాశయం ఎగువ, దిగువ కాలువల పరిధిలో ఉన్న 12,500 ఎకరాలకు ఖరీఫ్ సీజన్‌లో పూర్తిస్థాయిలో వరినాట్లు పూర్తిచేయడంతో పాటు మొదటి పంట చేతికి వచ్చే వరకు సాగునీరు అందిస్తామన్నారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 99.40 మీటర్లు ఉందన్నారు. జలాశయం ఎగువ ప్రాంతాల నుంచి 30 క్యూసెక్కుల వరకు సాగునీరు వస్తుండగా, ఎగువ కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, దిగువ కాలువ ద్వారా 150 క్యూసెక్కులు నీటిని విడుదల చేశామన్నారు. ఈ సందర్భంగా మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మాట్లాడుతూ సాగునీటి సమస్యల పరిష్కారంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, టీడీపీ నాయకులు కుచ్చు కళావతి, ఎర్రా అప్పారావు, పంచాడ దాలెంనాయుడు, ఏఈ సీహెచ్ జయరాంపడాల్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేరు జలాశయం నుంచి...

మాడుగుల రూరల్: మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయం నుంచి నీటిని జలాశయం అధికారులు విడిచిపెట్టారు. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా గురువారం ఉదయం 136.60 మీటర్లకు చేరడంతో జలాశయం మూడో గేటు తెరిచి 250 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టినట్టు జలాశయం ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇన్‌ఫ్లో 280 క్యూసెక్కుల వస్తోందన్నారు. అలాగే కుడికాలువ 10 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 20 క్యూసెక్కులు నీటిని పంటల సాగుకు విడిచిపెడుతున్నామని ఏఈ తెలిపారు.

శ్రావణం ఉత్సవాలకు అమ్మ ఆలయం ముస్తాబు



మాడుగుల, ఆగస్టు 1 : మండల కేంద్రం మాడుగులలోని శ్రీదేవి ఆలయం శ్రావణ మాసం ఉత్సవాలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా కనకదుర్గమ్మ విగ్రహానికి అందమైన రంగులు వేయడంతో పాటు ఆలయంలోని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

9న చోడవరంలో ఆదివాసీల దినోత్సవం

చీడికాడ, ఆగస్టు 1 : చోడవరంలో ఈనెల తొమ్మిదో తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవాన్ని అంతా విజయవంతం చేయాల్సిందిగా సీపీఐ ఎంఎల్ చీడికాడ మండల నాయకులు కోరారు. ఈ మేరకు కోనాం సంతలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు.నాయకులు జన్ని లక్ష్మణరావు, భాస్కరరావు, చంటి, సత్యారావు, వెంకటేశ్వరరావు, గణేష్ పాల్గొన్నారు.